క్లుప్తంగా

టీటీడీ సీవీఎస్‌ఓ బాధ్యతల స్వీకరణ



శ్రీవారి ఆలయంలో సీవీఎస్‌ఓ శ్రీధర్

తిరుమల : టీటీడీ సీవీఎస్‌ఓ ఎస్.శ్రీధర్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఈ క్రమంలో శ్రీవారి ఆలయం వద్దకు చేరుకున్న ఆయనకు అధికారులు స్వాగతం పలికారు. రంగనాయకుల మండపంలో బాధ్యతలు స్వీకరించిన తర్వాత ఆయన శ్రీవారిని దర్శించుకున్నారు. అనంతరం వేదపండితులు ఆశీర్వచనం ఇచ్చారు. టీటీడీ అధికారులు తీర్థప్రసాదాలను అందజేశారు . సీవీఎస్‌ఓ మాట్లాడుతూ శ్రీవారి సన్నిధిలో విధులు నిర్వర్తించడం పూర్వజన్మ సుకృతమన్నారు. చిత్తశుద్ధితో భక్తులకు సేవలందిస్తామని వెల్లడించారు. కార్యక్రమంలో వీజీఓ నందకిషోర్, ఏవీఎస్‌ఓలు మనోహర్, గిరిధర్ పాల్గొన్నారు.

క్రిస్టియన్ కౌన్సిల్ అధ్యక్షుడికి సత్కారం



ప్రవీణ్‌ను సత్కరిస్తున్న పాస్టర్లు, బిషప్‌లు

తిరుపతి కల్చరల్ : వివిధ దేశాల్లో పర్యటించి స్వదేశానికి విచ్చేసిన ఆలిండియా క్రిస్టియన్ చర్చెస్ కౌన్సిల్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఎలమంచిలి ప్రవీణ్‌ను బుధవారం కౌన్సిల్ జాతీయ అధ్యక్షుడు బిషప్ మోహన్‌దాస్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో రెవరెండ్ జరాల్డ్ ఆలిండియా మైనారిటీ అధ్యక్షుడు, పాస్టర్ నాథన్ మోసెస్, కో–ఆర్డినేటర్ బిషప్ టైటస్ సమాధానం, ఆలిండియా చీఫ్ జాయింట్ సెక్రటరీ బిషప్ పాల్ జ్ఞానం, బిషప్ మోసెస్ పాల్గొన్నారు.

9న ఆదివాసీ దినోత్సవం

తిరుపతి కల్చరల్ : బైరాగిపట్టెడలోని గిరిజన భవన్‌లో ఈనెల 9వ తేదీ ఉదయం 10 గంటలకు అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవం నిర్వహించనున్నట్లు ఆలిండియా బంజారా సేవా సంఘ గిరిజన మోర్చా అధ్యక్షుడు గుండాల నాయక్ తెలిపారు. బుధవారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడారు. వేడుకలకు కలెక్టర్‌తో పాటు తిరుపతి, చంద్రగిరి ఎమ్మెల్యేలు ముఖ్య అతిథులుగా హాజరుకానున్నట్లు వెల్లడించారు. సమావేశంలో వెంకటరమణ నాయక్, శివ నాయక్, కళావతి పాల్గొన్నారు.

గేట్ కళాశాలలో క్యాంపస్ డ్రైవ్

తిరుపతి సిటీ : స్థానిక భవానీనగర్‌లోని గేట్ కళాశాలలో శుక్రవారం క్యాంపస్ డ్రైవ్ చేపట్టనున్నట్లు కళాశాల చైర్మన్ డాక్టర్ టి.వెంకటేశ్వర్లు తెలిపారు. ఇంటర్ సీఈసీ, హెచ్‌ఈసీ, బైపీసీ, ఒకేషనల్ కోర్సులు పూర్తి చేసిన విద్యార్థులకు హెచ్‌సీఎల్–టెక్‌బీ సంస్థ ప్రతినిధులు ప్రత్యేక ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. హాజరయ్యేందుకు అభ్యర్థులు ముందుగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. వివరాలకు 6363095030, 7780323850 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

చిన్నగొట్టిగల్లు తహసీల్దార్‌గా జనార్దన్‌రాజు

భాకరాపేట : చిన్నగొట్టిగల్లు మండల తహసీల్దార్‌గా జనార్దన్‌రాజు బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఆయన మాట్లాడుతూ భూ సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యమిస్తామని తెలిపారు.

చేనేతలకు సత్కారం



చేనేత వస్త్రాలు కొనుగోలు చేస్తున్న నాయకులు

తిరుపతి గాంధీ రోడ్ : జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా బుధవారం గాంధీరోడ్‌లో చేనేత కార్మికులను బీజేపీ నేతలు సత్కరించారు. అనంతరం చేనేత వస్త్రాలను కొనుగోలు చేశారు. కార్యక్రమంలో బీజేపీ నేతలు గుండాల గోపీనాథ్, సుబ్రమణ్యం యాదవ్, ఫణిభూషణ్‌రెడ్డి, దేవానంద్, వీరభద్రరావు, బతోండ మనాటి సుబ్రమణ్యంరెడ్డి పాల్గొన్నారు.

వాణిజ్యశాస్త్ర హెడ్‌గా జయచంద్రారెడ్డి

తిరుపతి సిటీ : ఎస్వీయూ వాణిజ్యశాస్త్ర విభాగాధిపతిగా కె.జయచంద్రారెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు బుధవారం వర్సిటీ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. హెడ్‌గా బాధ్యతలు చేపట్టిన ఆయనను ప్రిన్సిపల్ పీవీ నరసయ్య, మోహన్‌రెడ్డి, వెంకటేశ్వర్లు ఘనంగా సన్మానించారు.

మత్తు అనర్థాలపై అవగాహన

తిరుపతి సిటీ : మత్తు పదార్థాల వాడకంతో తలెత్తే అనర్థాలపై బుధవారం పద్మావతి మహిళా డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో విద్యార్థినులకు అవగాహన కల్పించారు. యాంటీ ర్యాగింగ్, యాంటీ డ్రగ్స్ కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన కార్యక్రమంలో ప్రిన్సిపల్ నారాయణమ్మ మత్తు పదార్థాల వినియోగం కుటుంబాన్ని మొత్తం విచ్ఛిన్నం చేస్తుందనే విషయం గుర్తుంచుకోవాలన్నారు. స్విమ్స్ సైకియాట్రిస్ట్ డాక్టర్ దుర్గాంజలి మాట్లాడుతూ మత్తు వినియోగం ప్రాణాంతకమన్నారు. కార్యక్రమంలో పాస్ కౌన్సిలర్ బాలస్వామి నాయక్, న్యాయవాది అపర్ణాదేవి, అధ్యాపకులు భద్రమణి, ఉమారాణి, వసుధ, జ్యోతి, విద్యుల్లత, శిరీష పాల్గొన్నారు.

వ్యర్థంలో అర్థం

కాదేదీ కవితకు అనర్హం.. సబ్బుబిళ్ల..కుక్కపిల్ల.. అగ్గిపుల్ల అని ఓ కవి పేర్కొన్నట్టు.. తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ సైతం వ్యర్థాలను ×అర్థ×వంతంగా వినియోగించుకుంటోంది. నగరవాసుల నుంచి చెత్త సేకరించి సంపద సృష్టిస్తోంది. వేస్ట్ మేనేజ్‌మెంట్‌కు సంబంధించి దేశంలోనే తొలిస్థానంలో నిలుస్తోంది. వినూత్న ఆలోచనలతో ఆదాయ వనరులను సమకూర్చుకుంటోంది. అందులో భాగంగా మహేంద్ర వేస్ట్ టు ఎనర్జీ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థతో ఒప్పందం కుదుర్చుకుంది. తడి చెత్తతోపాటు ఫుడ్‌వేస్ట్ నుంచి బయోగ్యాస్ ఉత్పత్తి చేయిస్తోంది.



తూకివాకం గ్రీన్ సిటీలోని బయో గ్యాస్ ప్లాంట్

- సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్‌లో తిరుపతి కార్పొరేషన్ ఫస్ట్
- తడి.. పొడి చెత్త నుంచి సంపద సృష్టి
- నిత్యం 900 కేజీల బయోగ్యాస్ ఉత్పత్తి
- కిలో రూ.91 చొప్పున స్టార్ హోటళ్లకు విక్రయం
- నాలుగున్నరేళ్లగా సమకూరుతున్న ఆదాయం

తిరుపతి తుడా : చెత్తను రెడ్యూజ్ చేద్దాం.. రీయూజ్ చేద్దాం.. రీసైకిల్ చేద్దాం.. చేయి చేయి కలుపుదాం.. అంటూ ఐదేళ్ల క్రితం తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు ఇచ్చిన పిలుపు నేడు సత్ఫలితాలనందిస్తోంది. చెత్త ద్వారా సిరులు రాబడుతోంది. చెత్తను సద్వినియోగ పరిచి తద్వారా ఆర్థికంగా.. ఆరోగ్యపరంగా ముందుకెళ్లేందుకు నగరపాలక సంస్థ అధిక ప్రాధాన్యం ఇచ్చింది.

రోజుకు 210 టన్నులు

తిరుపతి నగరంలో రోజుకు 210 టన్నులకు పైగా చెత్త ఉత్పత్తి అవుతుంది. గతంలో ఈ చెత్తను డంపింగ్ యార్డులకు తరలించేవారు. యార్డుల్లో చెత్త నిల్వ ఉండడం వల్ల సమీప ప్రాంతాలవారు తీవ్రంగా ఇబ్బంది పడేవారు. దీంతో తడి చెత్త ద్వారా బయోగ్యాస్ తయారీ కోసం మహేంద్ర వేస్ట్ టు ఎనర్జీ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్‌తో మున్సిపల్ కార్పొరేషన్ ఎంఓయూ కుదుర్చుకుంది. ఈ నేపథ్యంలో మహేంద్ర కంపెనీ రూ.14.5 కోట్ల వ్యయంతో తూకివాకంలోని బయోగ్రీన్ సిటీలో 50 టన్నుల సామర్థ్యంతో బయోమెథనేషన్ ప్లాంట్ నిర్మించింది. ఈ ప్లాంట్ దేశంలోనే అతి పెద్ద బయోగ్యాస్‌ను ఉత్పత్తి కేంద్రంగా మారింది.

20 ఏళ్ల లీజుతో..

మహేంద్ర కంపెనీ బయోమెథనేషన్ ప్లాంట్‌ను 20 ఏళ్ల పాటు లీజుకు నిర్వహిస్తుంది. లీజు తీరాక తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్‌కు ప్లాంటు బాధ్యతలు అప్పగించనుంది. ప్రస్తుతానికి నగరపాలక సంస్థ ఉచితంగా స్థలం కేటాయించడంతోపాటు నీరు సరఫరా చేస్తోంది. తడిచెత్తను ప్లాంట్ వద్దకు చేర్చే బాధ్యతను సైతం తీసుకుంది. మిగతా గ్యాస్ ఉత్పత్తి పనులను కంపెనీనే నిర్వహిస్తోంది.

రోజుకు 900 కేజీల బయోగ్యాస్..

ఈ ప్లాంట్‌లో రోజూ 900 కేజీల బయోగ్యాస్‌ను ఉత్పత్తి చేస్తున్నారు. సుమారు 5లక్షల లీటర్ల సామర్థ్యంతో గ్యాస్ స్టోరేజీకి బెలూన్ ఏర్పాటు చేశారు. ఇక్కడ ఉత్పత్తి అయ్యే గ్యాస్‌ను తిరుపతి, బెంగళూరు చెన్నైలోని స్టార్ హోటళ్లకు విక్రయిస్తున్నారు. 25 కిలోల సామర్థ్యంతో సిలిండర్లను తరలిస్తున్నారు. కిలో రూ.91 ధరతో సరఫరా చేస్తున్నారు.

నాలుగేళ్లకు పైగా..

బయోమెథనేషన్ ప్లాంట్ ప్రారంభమై నాలుగున్నరేళ్లు అయింది. అప్పట్లో కమిషనర్ గిరీషా బాధ్యతలు చేపట్టాక మూడునెలల వ్యవధిలోనే బయోగ్యాస్ ప్లాంట్ నిర్మాణాలను పూర్తి చేయించారు. 2019 అక్టోబర్‌లో నాటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి చేతుల మీదుగా ప్లాంట్‌ను ప్రారంభించారు. అప్పటి నుంచి ఈ ప్లాంట్ ఆదాయ మార్గంలో పయనిస్తోంది. ఈ క్రమంలోనే పొడి చెత్త ద్వారా సేంద్రియ ఎరువులను తయారు చేయించి విక్రయిస్తూ తిరుపతి కార్పొరేషన్ ఆధ్వర్యంలో లాభాలను ఆర్జిస్తోంది.



తడిచెత్త, ఫుడ్ వేస్ట్‌ను నిల్వ చేసే ట్యాంకు



తడిచెత్త నుంచి ఉత్పత్తి చేసిన బయోగ్యాస్‌తో నింపిన సిలిండర్లు

చెత్త సమస్య పరిష్కారం



తిరుపతి నగరంలో ఉత్పత్తి అయ్యే చెత్తను సద్వినియోగ పరుచుకోవడం గతంలో కార్పొరేషన్‌కు సవాలుగా ఉండేది. డంపింగ్ యార్డులో ఏళ్ల తరబడి నిల్వ ఉండడం వల్ల భూగర్భ జలాలతో పాటు గాలి కూడా కలుషితమయ్యేది. సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్‌తో చెత్తపై సమరం మొదలైంది. నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ నిబంధనల మేరకు చెత్తను సెగ్రిగేషన్ చేసి పూర్తిస్థాయిలో వినియోగంలోకి తెస్తున్న నగరాల్లో తిరుపతి అగ్రస్థానంలో నిలిచింది. ఈ క్రమంలోనే మొత్తం ప్రక్రియను మరింత పటిష్టంగా అమలు చేసేందుకు చర్యలు తీసుకుంటాం.

– ఎన్.మౌర్య, కమిషనర్, తిరుపతి నగరపాలక సంస్థ

ప్రజల సహకారంతోనే పరిశుభ్రత



అధికారులకు సూచనలిస్తున్న కమిషనర్ మౌర్య

తిరుపతి తుడా : ప్రజల సహకారంతోనే నగర పరిశుభ్రత సాధ్యమని కమిషనర్ మౌర్య తెలిపారు. బుధవారం నగరంలోని పలు ప్రాంతాలలో అనధికారికంగా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు, హోర్డింగ్‌లను పరిశీలించారు. డివైడర్లపై ఉన్న అనధికార పోస్టర్లు, ఫ్లెక్సీలను వెంటనే తొలగించాలని ఆదేశించారు. అనంతరం అన్న క్యాంటీన్లను పరిశీలించి పెండింగ్ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. చెత్తతో నిండిన ఖాళీ స్థలాలకు సంబంధించి వాటి యజమానులకు నోటీసులు ఇవ్వాలని స్పష్టం చేశారు. అదనపు కమిషనర్ చరణ్ తేజ్‌రెడ్డి, ఎస్ఈ మోహన్, ఎంఈ వెంకట్రామిరెడ్డి, డీఈ శ్రావణి, డీసీపీ శ్రీనివాసులురెడ్డి, ఏసీపీ బాల సుబ్రమణ్యం, హెల్త్ ఆఫీసర్ యువ అన్వేష్‌రెడ్డి పాల్గొన్నారు.

మహిళలకు టైలరింగ్ శిక్షణ

తిరుపతి కల్చరల్ : మబ్బు సూర్యనారాయణరెడ్డి ట్రస్ట్, సెట్విన్ ఆధ్వర్యంలో బుధవారం ఎస్‌టీవీనగర్‌లోని శ్రీవిజ్ఞాన ఉన్నత పాఠశాల ఆవరణలో మహిళలకు ఉచిత టైలరింగ్ శిక్షణ తరగతులు ప్రారంభించారు. కార్యక్రమంలో విశ్రాంత బ్యాంకు మేనేజర్ ప్రభాకర్‌రావు, అభినయ ఆర్ట్స్ కార్యదర్శి బీఎన్ రెడ్డి, సెట్విన్ అసిస్టెంట్ మేనేజర్ నాయక్, ట్రస్ట్ అధినేత మబ్బు సూర్యనారాయణరెడ్డి, పాఠశాల కరస్పాండెంట్ ఎం.జనార్దన్ నాయుడు పాల్గొన్నారు.

భూ సమస్య పరిష్కారానికి వినతి

తిరుపతి మంగళం : శెట్టిపల్లె పంచాయతీలోని భూ సమస్యను పరిష్కరించాలని సీపీఎం నాయకులు కోరారు. బుధవారం ఈ మేరు తిరుపతి కార్పొరేషన్ కమిషనర్ మౌర్యకు సీపీఎం జిల్లా కార్యదర్శి వందాసి నాగరాజు, శెట్టిపల్లె భూ పరిరక్షణ కమిటీ నాయకులు వినతిపత్రం సమర్పించారు. నాగరాజు మాట్లాడుతూ ల్యాండ్ పూలింగ్ నిర్వాసితులకు లేఔట్ వేసి స్థలాలు అప్పగించాలని కోరారు. నాయకులు ఎ.రాధాకృష్ణ, ఎస్. శ్రీనివాసులు, గోడ్ల నాదముని, మోహన్, మల్లికార్జున్ పాల్గొన్నారు.

తల్లిపాలే ఆరోగ్య సంజీవని



మాట్లాడుతున్న స్విమ్స్ డైరెక్టర్ ఆర్‌వీ కుమార్

తిరుపతి తుడా : స్విమ్స్ పద్మావతి ఆస్పత్రిలో రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో బుధవారం తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ స్విమ్స్ డైరెక్టర్ డాక్టర్ ఆర్‌వీ కుమార్ మాట్లాడుతూ తల్లిపాలు బిడ్డకు ఆరోగ్య సంజీవనిగా ఉపయోగపడతాయన్నారు. పీడియాట్రిక్స్ హెడ్ డాక్టర్ పునీత్ , గైనకాలజీ విభాగాధిపతి డాక్టర్ మాలతి, రోటరీ క్లబ్ ప్రాజెక్ట్ చైర్మన్ టి.దామోదరం, ఆర్‌ఎంఓ కోటిరెడ్డి, డాక్టర్లు మృదుల, శిల్పా, ఇందుజ, సువృతి, సుమన, రామ్‌మోహన్‌రెడ్డి, టి.శేషయ్య పాల్గొన్నారు

రామచంద్రాపురం: మండలంలోని కుప్పంబాదూరు అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. అంగన్‌వాడీ సూపర్‌వైజర్ రేవతి పాల్గొన్నారు.

భాకరాపేట : చిన్నగొట్టిగల్లు అంగన్‌వాడీ సెంటర్‌లో గర్భిణులు, బాలింతలకు తల్లిపాల విశిష్టతపై అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ టీచర్ కిరణ్మయి పాల్గొన్నారు.

మత్తుతో భవిష్యత్తు అంధకారం



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ప్రిన్సిపల్ సుధాకర్‌రెడ్డి

తిరుపతి సిటీ : మత్తు పదార్థాలకు అలవాట పడితే యువత భవిష్యత్తు అంధకారంగా మారుతుందని ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.సుధాకర్‌రెడ్డి తెలిపారు. బుధవారం స్థానిక కరకంబాడి రోడ్డులోని ఎస్వీసెట్ కళాశాలలో వియార్ విత్ యూ చారిటబుల్ సంస్థ, ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో మాదకద్రవ్యాల వినియోగంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రిన్సిపల్ మాట్లాడుతూ యువత దురలవాట్లకు దూరంగా ఉండాలని, ఉన్నత విద్యను క్రమశిక్షణతో అభ్యసించాలని సూచించారు. ఇంటర్నేషనల్ హోమియోపతి క్లినిక్ వైద్యుడు మధు ఆజాద్ మాట్లాడుతూ మాదకద్రవ్యాల వినియోగం ఆరోగ్యానికి హానికరమని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ రోజా, గీతా, చంద్రయ్య, సుజన్ కుమార్ పాల్గొన్నారు.

బీపీ మండల్‌కు ఘన నివాళి



నివాళులర్పిస్తున్న బీసీ ఉద్యోగ సంఘం నేతలు

తిరుపతి కల్చరల్ : దేశంలో ఓబీసీలకు 27శాతం రిజర్వేషన్లు అమలు చేసిన రోజును పురస్కరించుకుని బుధవారం బీసీ ఉద్యోగుల సంఘం నేతలు బీపీ మండల్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. బీసీల బాంధవుడు బీపీ మండల్ అని సంఘం జిల్లా ప్రధానకార్యదర్శి వంకీపురం పవన్ కొనియాడారు. కార్యక్రమంలో గోపాల్, సునీల్‌కుమార్ యాదవ్, పెరుమాళ్, మునిప్రకాష్, వెంకటసుబ్బయ్య, హేమాద్రి, భూపతి, భానుప్రకాష్, గుణశేఖర్ పాల్గొన్నారు.

వైభవంగా అర్జున తపస్సు



తపస్సుమాను ఎక్కుతున్న అర్జున వేషధారి

పాకాల : మండలంలోని మొబ్బినాయనపల్లెలో సాగుతున్న మహాభారత ఉత్సవాల్లో భాగంగా బుధవారం వైభవంగా అర్జున తపస్సు నిర్వహించారు. నిర్వాహకుడు మొబ్బినేని రఘుపతి కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. తపస్సుమానుపై నుంచి అర్జున వేషధారి విసిరిన నిమ్మ, అరటి పండ్లను ప్రజలు భక్తిపూర్వకంగా పట్టుకున్నారు.

నిత్యావసరాల వితరణ



సరుకులు అందిస్తున్న లయన్స్‌క్లబ్ సభ్యులు

పాకాల : అగ్నిప్రమాదంలో నష్టపోయిన బాధితులకు బుధవారం లయన్స్ క్లబ్ వారు చేయూతనందించారు. క్లబ్ అధ్యక్షుడు నాగూర్‌బాషా, డీసీ కేస్ మస్తాన్, జి.రామయ్య, బషీర్ చేతులమీదుగా బాధితురాలు బీబీకి రూ.11వేల విలువైన బియ్యం, నూనె, కందిపప్పు, బెడ్‌షీట్స్, టవళ్లు, పాత్రలు అందజేశారు. కార్యక్రమంలో నాగూర్‌బాషా, యాసానుల్లా, మహ్మద్, నిజాముద్దీన్, సతీష్, ఆనందయ్య, నాగూర్ పాల్గొన్నారు.

నెరవేరిన సంకల్పం

- మూలస్థాన ఎల్లమ్మ ఆలయ పునర్నిర్మాణం
- అమ్మవారి సేవలో చెవిరెడ్డి



చంద్రశేఖర్‌రెడ్డిని సత్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి

చంద్రగిరి : చంద్రగిరి గ్రామ దేవతగా ప్రసిద్ధి చెందిన మూలస్థాన ఎల్లమ్మ తల్లి ఆలయ పునర్నిర్మించాలన్న చెవిరెడ్డి సంకల్పం నెరవేరింది. భవిష్యత్ తరాలు గుర్తుంచుకునేలా అప్పటి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి ఈ మహత్కార్యానికి శ్రీకారం చుట్టారు. టీటీడీ నుంచి రూ.4కోట్లు, దేవదాయ శాఖ నుంచి రూ. కోటి, తుడా నుంచి రూ.1.65కోట్లు విడుదల చేయించారు. అప్పటి ఆలయ కమిటీ చైర్మన్ యారాశి చంద్రశేఖర్ రెడ్డి సైతం దాతల సహకారంతో మరో రూ. 1.33 కోట్లు విరాళాల రూపంలో సేకరించారు. అనంతరం అప్పటి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి చేతులు మీదుగా నిర్మాణం ప్రారంభించారు. అన్ని పనులు పూర్తి కావడంతో బుధవారం వైభవంగా ఆలయ కుంభాభిషేక మహోత్సవాలు మొదలయ్యాయి. ఈ క్రమంలో ఆలయం వద్దకు వచ్చిన చెవిరెడ్డికి ఆలయ అధికారులు సాదర స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం అర్చకులు అమ్మవారి తీర్థ ప్రసాదాలు అందించి ఆశీర్వదించారు. దర్శనానంతరం ఆలయాన్ని పరిశీలించిన చెవిరెడ్డి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆలయ పనులను అకుంఠిత దీక్షతో పూర్తి చేసిన యారాశి చంద్రశేఖర్ రెడ్డిని ఘనంగా సత్కరించారు. త్వరలో ఆలయ పునర్నిర్మాణం కోసం విరాళాలు అందించిన దాతలతో పాటు అప్పటి పాలక మండలి సభ్యులకు పౌర సన్మానం చేయనున్నట్లు చెవిరెడ్డి ప్రకటించారు. కుంభాభిషేక ఉత్సవాలలో పాల్గొన్న ఎమ్మెల్యే పులివర్తి నాని దంపతులకు కృతజ్ఞతలు తెలిపారు.

వైభవంగా కుంభాభిషేకం

మూలస్థాన ఎల్లమ్మ ఆలయ మహా కుంభాభిషేక మహోత్సవాలు బుధవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. కార్యక్రమంలో ఎమ్మెల్యే పులివర్తి నాని దంపతులు పాల్గొన్నారు. అమ్మవారికి విశేష పూజలు, హోమాలు, అభిషేకాలు జరిపించారు.

'సిద్ధార్థ'లో ఓరియెంటేషన్ డే

తిరుపతి రూరల్ : తిరుపతి రూరల్ మండలం సి.గొల్లపల్లెలోని సిద్ధార్థ ఇంజినీరింగ్ కళాశాలలో బుధవారం వేడుకగా ఓరియెంటేషన్ డే నిర్వహించారు. ప్రిన్సిపల్ డాక్టర్ రాజశేఖర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా ప్రజారవాణా శాఖాధికారి చెంగల్‌రెడ్డి, సిద్ధార్థ విద్యా సంస్థల కార్యదర్శి ఆనంద్‌రెడ్డి హాజరయ్యారు. అనంతరం అధ్యాపకులు పలు అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.కార్యక్రమంలో కళాశాల వైస్ చైర్మన్ విజయ్‌రెడ్డి, రవి పాల్గొన్నారు.

యాదవుల అభ్యున్నతికి కృషి

తిరుపతి కల్చరల్ : యాదవుల అభ్యున్నతికి నిరంతరం కృషి చేస్తున్నట్లు యాదవ యువజన మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు శంకర్ యాదవ్ తెలిపారు. బుధవారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడారు. మహాసభ నేతలు అప్పగించిన బాధ్యతలను చిత్తశుద్ధితో నిర్వర్తిస్తానని వెల్లడించారు. అనంతరం శంకర్‌యాదవ్‌ను యాదవ మహాసభ జిల్లా నేతలు సత్కరించారు. సమావేశంలో రాజేష్ యాదవ్, సుబ్బు యాదవ్, సునీల్ యాదవ్, ఉదయ్ యాదవ్, పూర్ణా, చిరంజీవి, మోహన్ యాదవ్ పాల్గొన్నారు.

ఆదమరిస్తే అంతే..!

- గత ఏడాది మే 14వ తేదీన అనంతపురం జిల్లా రాయదుర్గానికి చెందిన భక్తుల బృందం శ్రీవారిని దర్శించుకుని ఘాట్ రోడ్డులోని ఆంజనేయస్వామి గుడి దగ్గర ఆగారు. వాహనం నుంచి కిందకు దిగిన పార్వతి అనే వృద్ధురాలిని వెనుక నుంచి అతివేగంగా వస్తున్న మరో వాహనం ఢీకొంది. దీంతో ఆమె అక్కడికక్కడే మరణించింది.
- గత ఏడాది మే 29వ తేదీన మొదటి ఘాట్ రోడ్‌లో తిరుపతికి వసుతన్న ప్రైవేట్ వ్యాన్ ప్రమాదానికి గురైంది. 14 మంది గాయపడ్డారు. డ్రైవర్ సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనం నడపడం వల్లే ప్రమాదం జరిగినట్లు పోలీసులు గుర్తించారు.
- ఈ ఏడాది మార్చి 3వ తేదీన బెంగళూరుకు చెందిన మహిళ తన కుటుంబంతో కలిసి కారులో తిరుమలకు వచ్చింది. శ్రీవారి దర్శనానంతరం తిరుగుప్రయాణంలో ఘాట్‌రోడ్డులోని ఎలిఫెంట్ ఆర్చ్ వద్ద కారు అదుపుతప్పి పిట్టగోడను ఢీకొంది. ఈ ప్రమాదంలో మహిళ మృతి చెందింది. కుటుంబీకులు గాయపడ్డారు.

- తిరుమల ఘాట్‌లో వరుస ప్రమాదాలు
- కొండ ఎక్కేందుకు జంకుతున్న భక్తులు
- నిబంధనలు పాటించని వాహనదారులు
- అధిక వేగమే కారణమంటున్న పోలీసులు



తిరుమల ఘాట్ రోడ్డులో ప్రమాదానికి గురైన వాహనాలు (ఫైల్)

తిరుపతి క్రైమ్ : కలియుగ దైవం కొలువుదీరిన పవిత్ర పుణ్యక్షేత్రం తిరుమల. శ్రీవేంకటేశ్వర స్వామివారిని దర్శించుకునేందుకు నిత్యం వేలాది మంది దేశ, విదేశాల నుంచి వస్తుంటారు. తిరుమలకు వెళ్లిరావాలంటే ఘాట్ రోడ్ల మీదుగా ప్రయాణం చేయాల్సిందే. అయితే ఈ రోడ్లపై తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇటీవల కాలంలో వరుస యాక్సిడెంట్లతో అటు భక్తులు.. ఇటు టీటీడీ అధికారులు ఆందోళన చెందుతున్నారు. తాజాగా బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో తమిళనాడుకు చెందిన దంపతులు బస్సు కింద పడి దుర్మరణం పాలయ్యారు.

అతివేగమే కారణం

స్పీడ్ లిమిట్ నిబంధనలను ఎత్తివేయడం కూడా ఘాట్‌లో ప్రమాదాలకు ఒక కారణమని తెలుస్తోంది. గతంలో అలిపిరి నుంచి తిరుమలకు ప్రయాణ సమయం 28 నిమిషాలుగా ఉండేది. తిరిగి వచ్చే సమయం 40 నిమిషాలు ఉండాలన్న నిబంధనను కఠినంగా అమలు చేశారు. అంతకంటే వేగంగా వాహనాలు రాకపోకలు సాగిస్తే చర్యలు తీసుకునేవారు. ఇటీవల ఈ స్పీడ్ లిమిట్ నిబంధనను సడలించారు. అప్పటి నుంచి డ్రైవర్లు వాహనాలను ఓవర్ స్పీడ్‌తో నడుపుతున్నట్లు పోలీసులు గుర్తించారు. అతివేగంతో వాహనాలను ఓవర్ టేక్ చేసే సమయంలోనే ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్నట్లు టీటీడీ అధికారులు వెల్లడిస్తున్నారు.

కాలం చెల్లిన వాహనాలతో ప్రమాదం

తిరుమలకు నిత్యం సుమారు 10వేల కార్లు, టెంపోలు, జీపులు, 300 వరకు ఆర్టీసీ బస్సులు రాకపోకలు సాగిస్తుంటాయి. ఇందులో కాలం చెల్లిన వాహనాలు కూడా ఉంటాయి. ఫిట్‌గా లేని వాహనాల్లో తిరుమలకు ప్రయాణం చేయడం ప్రమాదకరం. అయితే ఫిట్‌నెస్ లేని వాహనాలను ఘాట్‌లోకి అనుమతించమని అధికారులు చెబుతున్నా.. కార్యరూపం దాల్చడంలేదు.

తూతూ మంత్రంగా హెల్మెట్ నిబంధన

ద్విచక్రవాహనదారులు ఘాట్‌లో హెల్మెట్ ధరించే ప్రయాణించాలని టీటీడీ అధికారులు నిబంధన విధించారు. అయితే చాలా మంది హెల్మెట్‌ను కేవలం అలంకారప్రాయంగానే వినియోగిస్తున్నారు. అలిపిరి చెక్‌పోస్టు వద్ద హెల్మెట్ వేసుకుని, తనిఖీ పూర్తవగానే దాన్ని కాస్తా పక్కన తగిలించేస్తున్నారు. దీంతో ప్రమాదం జరిగినప్పుడు ప్రాణాలను కోల్పోయే పరిస్థితి తెచ్చుకుంటున్నారు.

ఫలించిన పోరాటం



తాళం తొలగిస్తున్న అధికారులు

సాక్షి ఎఫెక్ట్..

భాకరాపేట : తాగునీటి కోసం దళితులు చేపట్టిన పోరాటం ఎట్టకేలకు ఫలించింది. 'తాగునీరు కల్పించండి మహోప్రభో' శీర్షికతో ప్రచురితమైన 'సాక్షి' కథనానికి అధికారులు స్పందించారు. చిన్నగొట్టిగల్లు మండలం జంగావాండ్లపల్లె పంచాయతీ మాదిగపల్లె గ్రామానికి మంచినీటిని అందించే మోటారు స్టాటరుకు టీడీపీ నాయకులు వేసిన తాళాన్ని తొలగించారు. బుధవారం ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సిద్ధారెడ్డి, పంచాయతీ కార్యదర్శులు ఎంపీ మోహన్‌రెడ్డి, నాగమణి, ఇంజినీరింగ్ అసిస్టెంట్ హేమమాధవి స్టార్టరు గదికి వేసిన తాళం తీసి గ్రామానికి నీరు సరఫరా చేశారు.